# శరత్ చెప్పిన కథలు

తెనిగింపు: సాంబశివరావ్ బొబ్బిళ్ల



శరత్ బాబు ఓనాడు పిచ్చాపాటీగా తన చిన్ననాటి ముచ్చట్లు చెప్తున్నాడు. ఆయన చుట్టూతా చేరినవాళ్ళల్లో ఆయన మామగారూ, గొప్పసాహిత్యవేత్తా అయినటువంటి సురేంద్రనాథ గంగూలీకూడా ఒకరు. శరత్ బాబు రచించిన 'శ్రీకాంత' పైని జరుగుతోంది చర్చ. వాదోపవాదాలు మాంచి రసకందాయంలో వుంటూండగా మధ్యనొకాయన గభాల్న లేచి,- "అయ్యా, శరత్ బాబుగారూ! ఇంతకూ యీ 'శ్రీకాంత' నవల్లో ఇంద్రనాథుడు పాత్ర ఉంది చూశారూ! ఈ పాత్ర వొట్టికల్పనేనా, లేకపోతే వాస్తవంగా జీవితంలో యెక్కడయినా చూశారా?" అంటూ అడిగాడు.

"ఎబ్బెబ్బే అది వుత్తకల్పనకాదు. అసలుసిసలు వాస్తవికపాత్రంటే నమ్మండి. భగల్పూర్లో మా మావయ్యగారింటిపక్కనే ఒహాయన వుంటూండేవారు. ఆయన మాంచి పేరుకెక్కిన గొప్పయింజనీరు. పేరు రామరతన్ మజుందారు. ఆయనగారి అబ్బాయి రాజన్ అయితే అందరూ ఆ అబ్బాయిని "రాజా-రాజా" అంటూ పిలవడం పరిపాటి. ఈ రాజే నా 'శ్రీకాంత' నవల్లో కనిపించే ఇంద్రనాథుడు. రాజా అన్నయ్య రావు బహద్దూర్ సురేన్ మజుందారు, డిప్టీ కలెక్టరు. ఆయన గొప్పసాహిత్యవేత్తా, సంగీతశాస్త్రజ్ఞుడున్నూ;—

"అయితే రాజుమాత్రం గొప్పగా చదువుకున్నవాడేమీ కాదు. కాని మాంచి వుపారయిన కుర్రాడు. అంత చిన్నవయసులో అలాంటి చురుకైన కుర్రాణ్ణి యింతవరకూ నేనెక్కడా చూళ్ళేదు. అందుకే 'శ్రీకాంత' నవల రాసేప్పుడు ఇంద్రనాథుడి చరిత్ర చిత్రించడానికి ఏమీ యిబ్బంది పడాల్సిన అవసరం లేకపోయింది. రాజా తరహా కూడా ముమ్మూర్తులా యిదే!- ఈవేళ సైతం ఆ అబ్బాయి తలపుకురాగానే నా మనసెంతో మథనపడ్తూంది. ఇప్పుడతగాడి ప్రస్తావనెలాగూ వొచ్చింది గనక ఓ చిన్న ముచ్చట చెప్తావినండి." అంటూ శరత్ బాబు రాజుకథ నిలా చెప్పడం మొదలెట్టాడు:

"రాజువుండే యింటికి చేరువలోనే పార్తూంది గంగానది. ఆ నదివొడ్డున ఓ పెద్ద మఱ్ఱిచెట్టు! తుపాకి వేసికొట్టినా యెవ్వరూ కనిపించరక్కడ; - ఆ మఱ్ఱిచెట్టు తాలూకు కొమ్మలు కొన్ని నదివేపు వొంగివున్నాయి. వాటిల్లో ఓ కొమ్మపైని యేవో నాలుగు టేన్ను రేకులు బిగించి రాజు అక్కడ తనకో చిన్న యిల్లు కట్టుకున్నాడు. రోజూ తెల్లవారేసరికి లేచి ఆ బుల్లి యింట్లో కెళ్ళి కూచుని గంటలతరబడి తదేకధ్యానంగా దేవుణ్ని ధ్యానిస్తుండేవాడు. అందుకే ఆ చిన్నయింటిని ప్రతివాళ్ళూ రాజు తాలూకు పూజగది అంటూండేవాళ్ళు. కానయితే ఆ యింట్లో అడుగుపెట్టేపాటి గుండె నిబ్బరం యింకొకరెవ్వరికీ వుండేదికాదు. నాకు మాత్రం తొలినుంచీ లైసెన్సిచ్చేశాడు. రాజు తరుచుగా నన్నా గదిలోకి స్వయంగా తీసుకెళ్తూండేవాడు. మఱ్ఱిచెట్టుకొమ్మలపైకెక్కి అంతవరకూ వెళ్లడమంటే ఏమంత తేలిక కాదు.

ఓహనాడు పూజాపునస్కారాలవీ ముగించుకుని రాజు యింటికి తిరిగొచ్చేస్తున్నాడు. దార్లో గంగానదివొడ్డున ఓచోట గబుక్కున ఆగిపోయాడు. అక్కడో గమ్మత్తు జరిగింది. మంచి యౌవనంలో మిసమిసలాడ్తున్న ఓ అందాల అమ్మాయి వొడ్డున కూచుని స్నానం చేస్తోంది. ఆ పక్కనే పల్లెటూరు మోటుమనిషెవడో ఒహాటను ఈత కొడ్తున్నట్లు నటిస్తూ ఆ యమ్మాయిపైని నీళ్ళు చిలకరిస్తున్నాడు. ఆ యమ్మాయికి అపరిమితమైన సిగ్గు!-అందుకని పాపం ఏమీ అనలేక వూరుకుంది. అది చూచి రాజు కెక్కడలేని కోపం ముంచుకొచ్చింది. ఇహ ముందూ, వెనకా చూడకుండా ఆ పళాన దభేల్న నదిలోకి గంతేశాడు. పైమీది తుండుగుడ్డతో ఆ పల్లెటూరి వెధవ మెడకి తగిలించి గబుక్కున ఓ మునక వేయించాడు. ఆ ఒక్కసారితో వూరుకున్నా డనుకున్నారేమిటి? వాడు వూపిరాడక వుక్కిరిబిక్కిరై ప్రాణాలు పోయేంతవరకూ అలా గిబ్బు గిబ్బున మునకలు వేయిస్తూనే వున్నాడు. వాడవతల చచ్చానుబాబో అని అరుస్తూంటే, మనవాడింకా వన్-టూ-త్రీ లెఖ్ఖపెడ్తున్నాడు అలా వంద సార్లు ముంచి తేల్చేక, "ఏమండీ! ఇహనైనా అందంగా కనిపించే అమ్మాయిని ఒంటరిగా చూసి అలుసుచేసి ఆమెపైని నీళ్లు జల్లరు గదా!" అంటూ హెచ్చరించాడు రాజు.

'బ్రతికొన్రా భగవంతుడా' అనుకుని అప్పుడే బాగా వూపిరి పీల్చుకుంటున్న ఆ పల్లెటూరి మొనగాడు ఆపసోపాలు పడుతూ "అమ్మోయ్-నాయనోయ్-లెంప లేసుకు చెపుతున్నా. ఇహ మళ్ళీ ఇలాంటి పనికి పోతే వొట్టు. బాబ్బాబూ-ఇహ నన్నొదిలి పెడుదురూ" అంటూ బ్రతిమాలుకో సాగాడు.

"సరే, ఇదుగో చూడు. ఇటుపక్క మళ్ళీ చూడకుండా పారిపో" అంటూ అతగాణ్ణి వొదిలిపెట్టేశాడు రాజు.

ఇంకోనాడు మరో సంగతి జరిగింది. ఆవేళ సాయంకాలం అలా షికారుకని ఇంటినుంచి బయలుదేరాడు రాజు. వెళ్ళే దార్లో అతనికి హైకూర్ట్ లు హెడ్మాష్టరుగా రవుపించారు. రాజుని చూసీ చూడగానే ఆయన భోరుమని ఏడుస్తూ వొచ్చావా నాయనా, నీగురించే చాలవాళ్ళుగా గాలిస్తున్నానయ్యా" అన్నారు.

"అదేమిటి మాష్టారూ! అలా యేడుస్తున్నారు?" అంటూ అడిగాడు రాజా.

"ఏం చెప్పను నాయనా! నా కర్మ ఇలా కాలింది. ఒహరి జోలి కెళ్ళేవాణ్ని కాను. ఒహరితో కయ్యాలాడేవాణ్ని కాను. అలాంటి వాణ్ని ఆ పోలీసు యినస్పెక్టరెంతలా బాదాడో చూడు. ఇదుగో నువ్వే చూడు. ఆవేళ జరిగిందేమీ లేదు. ప్రయివేటు చెప్పేందుకని జమీందారుగారింటికి బయల్దేరి వెళ్తున్నాను. దార్లో పోలీసు ఇనస్పెక్టరు గుర్రంపైని వొస్తూండడం చూసి గబుక్కున పక్కకి తప్పుకున్నాను. కానీ నా ఖర్మం కాలి, యినస్పెక్టరుగారి కెక్కడాలేని కోపం పుట్టుకొచ్చింది. "దార్లో కళ్లు మూసుకు నడుస్తావేం గాడిదకొడకా" అంటూ నోటి

# ★ బడాయితో లడాయి ★

కొచ్చిన తిట్లూ, చీవాట్లూ పెడ్తూ, చేతిలో వున్న బెత్తంతో దబదబా నన్ను బాదబోయి దక్కపోయాడు" అన్నాడు హెడ్మాస్టరు బావురుమని చిన్నపిల్లాడిలా ఏడుస్తూ.

"అలాగా! అయితే వాడిపని నే పడతానండి చూస్తారూ. వాణ్ణి నావచితగొట్టే ప్రూఫ్ కావాలి. ఇప్పుడు క్లబ్బులో కలిస్తే, అతను కుండికి పోయుంటాడు. తిరిగొచ్చేటప్పుడు వాడి అంతేవిటో నే తేలుస్తా. మీరు నిశ్చింతగా పోయి పడుకోండి. నేను ఆ పొగరుబోతువాడికి చేసేశాస్తి ఏమిటో రేపు మీకే తెలుస్తుంది" అంటూ హెడ్మాస్టరుకి కొంత ధైర్యం చెప్పి, రాజు తిన్నగా నా దగ్గరికొచ్చాడు. వాడిల్లు బంగారం కొన్న, వొచ్చిన వాడు వొచ్చినట్టే పూరుకుంటే బావుండును; కాని అగ్గిపిడుగులా అమాంతంగా నాపై విరుచుకుపడి - "శరత్ బాబూ, వున్నఫళంగా మీరు నాతో రావాలి. రానంటేమిటి వొచ్చి తీరాల్సిందే" అన్నాడు.

ఇదేవిటి చెప్మా ఇంత హఠాత్తుగా యేదో తెచ్చిపెట్టాడనుకున్నాను. అయినా అలాగని అతగాడివెంట ఠక్కున పోయినా, కొంప మునిగిపోతుంది. 'రాను' అనేపాటి గుండె ధైర్యం కూడా నాకు లేకపోయెను. అందుకని బిడుకు బిడుకులాడ్తూ—"అదేవిటి రాజూ, అంత కోపంగావున్నావ్? అయినా మన మెక్కడికి?—ఆ ఇనస్పెక్టరెక్కడ చెప్పు? ఆయన నడుం కెప్పుడూ ఓ పిస్టోలుంటుంది. మనదగ్గరమాస్తే పిస్తోలు కాదుకదా, పిడక ముక్క కూడా లేదుమరి! ఈసంగతి బాగా గుర్తుంచుకో?, అన్నాను.

"అదంతా మీ కనవసరం. మీరు నాతో రండి. అంతే. తర్వాతేం జరుగుతుందో చూద్దాందురు."

అతనింతలా అంటూంటే యింకేం వాదించను? నోరుమూసుకు చక్కా అతనివెంట బయల్దేరాను. ముందుగా మేం ఆదంపూర్ ఘాటు కెళ్ళాం. ఆ ఘాటుదగ్గిర ఓడలాగుతాయి. అక్కడెప్పుడూ ఏకో స్టీమరుగానీ, బోటుగానీ లంగరేసుకుని వుంటుంది. ఆ చీకట్లో కిక్కురుమనకుండా ఓ పెద్ద బోట్లో కెక్కి సరంగుకి తెలీకుండా దాని వాటి తాడు పట్టుకొచ్చాడు. నేనుమాత్రం [illegible] రాజు గబగబా కొచ్చి పడమన్నాడు.

ఆ పోలీసు ఇనస్పెక్టరుగారి బంగళా క్లబునించి ఇంచుమించు అరక్రోసుడు దూరాన వుంటుంది. అంతదూరం ఆయన రోజూ గుర్రంపైని వెళ్తా వొస్తూంటాడు. కానయితే ఎప్పుడు చూసినా గుర్రాన్ని యమస్పీడులో దౌడుతీయిస్తుంటాడు. అదే ఆయన దుర్గుణం. గాలికన్నా వేగంగా పరుగెత్తుతుంది ఆయన గారాలగుర్రం.

క్లబ్బుకీ, ఆయన బంగళాకీ మధ్య దార్లో ఓ చోట మేం ఇద్దరం పక్కగా నక్కి కూచున్నాం. చీకటి అంతకంతకు దట్టమవుతోంది. ఆయన ఎప్పుడు వొస్తాడా అని ఎదురుచూస్తున్నాం. ఆయన వొచ్చే సమయం చూసుకుని, రాజు తన చేతిలోని తాడు విప్పి ఎదురుగావుండే మానిడి చెట్టుపైకి రివ్వున విసిరి గట్టిగా కట్టాడు.

బాగా చీకటిపడిందని అప్పుడే చెప్పాగదూ! అందుకని అటువేపు కొకపిట్టయినా కదులాడ్డేదు. ఒక్క పిసరయినా జనసంచారం లేదక్కడ నమ్మండి. అటూ ఇటూ చెట్ల మధ్యను తాడుకట్టి, మేం కొమ్మలపైకెక్కి కూచున్నాం. కొంతసేపలా కూచున్నాక, టకీమని దూరాన్నుంచి గుర్రం పరుగెత్తుకొస్తున్న చప్పుడు మా చెవిని పడింది. ఆ చప్పుడుబట్టే అర్థంచేసుకున్నాం అయ్యగారేమో అప్పుడే క్లబ్బునుంచి దిగబడుతున్నారని. మామూలు అలవాటుప్రకారం వాయువేగంతో ఆయన గుర్రంపైని రయ్యిన కొట్టుకొచ్చేస్తున్నాడు. మేం వున్నచోటికొచ్చేసరికల్లా అయ్యగారూ, ఆయన గుర్రమూ అమాంతంగా తాడుకి తగులుకుని బోల్తాపడ్డారు. గుర్రాని కేదో దెబ్బతగిలింది. [illegible] కేమో, ఆ విసురుకి మొహంఅంతా రక్తంతో చిమ్మిపోయింది. ఆయన పాపం ఇంకా లేవనైనా లేవలేదు. అంతలో కొమ్మపైనించి కోదమసింగంలా దభేల్న ఆయనమీదపడి గఫీగఫీమని గ్రుద్దులు లంకించుకున్నాడు రాజు. ఆ దెబ్బలకి అయ్యగారి సారాయిమత్తు ఎక్కడిదక్కడే పటాపంచలై పోయింది. కొంత తెలివొచ్చింది. పోతేప్రాణం వచ్చే ప్రాణంతో గిజగిజమని గింజుకుంటున్నాడా ఇనస్పెక్టరు. ఆ సమయం చూసుకుని రాజు ఆయన నడుంకి తగిలించిన పిస్తోలు పైకితీసి నుంచుని "ఊఁ— ఇహ పదండి," అంటూ నాకు సైగచేశాడు.

ఆఘాఘాన్న మేం ఇద్దరం అక్కణ్ణుంచి కాళ్ళకు బుద్ధిచెప్పాం. మళ్ళీ ఆదంపూర్ ఘాటుకి తిరిగొచ్చి తాడు మళ్ళీ యథాస్థానములో పెట్టేసి, పిస్తోలు నీట్లోకి విసిరేసి చక్కా వొచ్చాం. ఇంటికొచ్చి — "ఇహ చాలు. వాడికి చెయ్యాల్సిన మరమ్మత్తు ఇంతే!" అన్నాడు రాజు.

"ఆ రాజే నా 'శ్రీకాంత' నవలలో నాయకుడు ఇంద్రనాథుడు. అన్యాయం అంటే పనీమిరా సహించడు. దాన్ని ఎదిరించేందుకు తన ప్రాణాలనైనా పణంగా అర్పించగలిగిన సాహసవంతుడు. నా జీవితములో ఎన్నడూ అలాంటివ్యక్తిని మళ్ళా చూసి ఎరగను. ఆ రాజు ఓనాడు ఎవరికీ చెప్పకుండా, చెయ్యకుండా పరారీఅయిపోయాడు. ఎక్కడికి వెళ్ళిపోయాడో, ఏమయ్యాడో ఎవ్వరికీ తెలీదు. ఈనాడు అతనికూసంత కళ్ళకు కట్టినట్టుంటుంది. మనసు చివుక్కుమంటుంది. అతను నా ప్రియమైనమిత్రుడు, సఖుడు, బంధువు. బడాయి అంటే గిట్టదు. పైగా బడాయి చెప్పుకునేవారితో లడాయి వేసుకుంటాడు. దేశ దేశా లెన్నెన్నో తిరిగాను, రకరకాల మనస్తత్వంగల మనుషులెందరినో కలుసుకున్నానుగాని, రాజులాంటి ఆసామీ ఇంతవరకూ ఒక్కడూ, ఎప్పుడూ అవుపించలేదంటే నమ్మండి," అంటూ ముగించాడు శరత్ బాబు. ★


## ఇవి తెలుసుకోవటం మంచిది

సంసార జీవితం అనుభవించుచు కూడ, అపకారమను మందులు లేకుండా పిల్లలు పుట్టకుండా చేసుకోవడానికి నవీనమైన 21 మార్గాలు 'సంతానము' అనే తెలుగు పుస్తకంలో వున్నాయి. అవసరం లేనప్పుడు గర్భం రాకుండా చేసే మార్గాలు, అసలు సంతానమే లేనివారికి అందుకు కారణాలు, కలిగే మార్గాలు, సుఖప్రసవానికి గర్భిణీ స్త్రీలు ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలు పసిపిల్లలను పుష్టిగా, ఆరోగ్యంగా ఎక్కువ ఖర్చులేకుండా పెంచే మార్గాలు. అవుసరమైనచోట బొమ్మలతో సహా ఎ. ఎస్. మూర్తి, యం. ఏ. గారు 'సంతానం' అనే పుస్తకంలో వ్రాశారు. అనేక సంసార సమస్యలను తీర్చగల అపూర్వగ్రంథం. మీరు చదివి తీరవలసిన పుస్తకం. ఇది క్రిందిచోటే దొరుకును. మూర్తి & వినాయకం 83, పీటర్సురోడ్డు, మద్రాసు-14 కు ఉత్తరం వ్రాసి వి. పి. ఖర్చుతో సహా రు. 3-50 లకు మీకు కూడ ఒక పుస్తకం వెంటనే పోస్టు ద్వారా పంపబడును.